క్లుప్తంగా

సచివాలయాల్లో ఎంపీడీఓ తనిఖీలు



పన్నూరులో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

విజయపురం: మండలంలోని పన్నూరు, జగన్నాథపురం, సూరికాపురం సచివాలయాల్లో మంగళవారం ఎంపీడీఓ రమణ ప్రకాష్ రికార్డులు తనిఖీ చేశారు. అలాగే ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సమయ పాలన పాటించాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పిస్తూ గిట్టుబాటు నగదు వచ్చేలా పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పని జరిగే చోట కూలీలకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

విజయపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 18వ తేదీ తిరుపతి పట్టణానికి చెందిన సురేంద్ర కంటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విజయపురం వికలాంగుల సేవా సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుంది. కంటి వైద్యం పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమైన వారికి డాక్టర్ సురేంద్ర కంటి పాసుపత్రిలో ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం



సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయపురం: మండల తహసీల్దార్ కిరణ్‌ను మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాలు, పూలమాలలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల బూత్ కన్వీనర్ రాజగోపాల్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు, కళవన్, పరంధామన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

శ్రీరంగరాజపురం: ఆరిమాను గంగమ్మ ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. మండలంలోని తయ్యూరు పాయికట్టులో నున్న ఆరిమాను గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. తహసీల్దార్ అమర్‌నాథ్, ఎంపీడీఓ మోహన్‌మురళి, జయశంకర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి నియోజకవర్గంలోని ఎస్ఎస్‌సీ పాస్, ఏదైనా డిగ్రీ కలిగిన యువతీయువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20వ తేదీ లోపు కళాశాలలోని స్కిల్ హబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థులు ఆధార్ కార్డు, మార్క్స్ లిస్టు జెరాక్స్ కాపీలు, ఫొటో తీసుకు రావాలని చెప్పారు. శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. వివరాలకు 63009 54441 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

పాలసముద్రం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నేడు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మంగళవారం ఎంపీడీఓ రామనాథ రెడ్డి తెలిపారు. మండల అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి సర్పంచ్, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు, హజరు కావాలని కోరారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు అభివృద్ధి చేయడానికి పనుల జాబితా తేవాలని సూచించారు.

పాఠశాలలకు భరతమాత చిత్రపటాలు



భరతమాత చిత్రపటాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

నగరి: ఉపాధ్యాయ సంఘం తరపున మున్సిపల్, మండల పరిధిలోని పాఠశాలలకు భరతమాత చిత్రపటాలను మంగళవారం పంపిణీ చేశారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉపాధ్యాయ సంఘం జిల్లా క్రీడా కన్వీనర్ చెన్నకేశవ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపస్ మండల అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిన పడేస్తారా?

- ప్రభుత్వ పెద్దలూ.. మా సంగతేంటి అంటున్న మద్యం దుకాణాల ఉద్యోగులు
- ప్రైవేట్ మద్యం దుకాణాలకే సర్కారు మొగ్గు
- అక్టోబర్ నెలలో కొత్తపాలసీ
- ప్రస్తుతం ప్రభుత్వ షాపుల్లో పని చేస్తున్న వందలాది మంది
- వారి భవిష్యత్ ప్రశ్నార్థకం
- దుకాణాల కోసం తెలుగు తమ్ముళ్ల ప్రయత్నాలు



కార్వేటినగరంలో ప్రభుత్వ మద్యం షాపు

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కొందరి పాలిట శాపంగా మారుతున్నాయి. వందలాది మంది చిరుద్యోగుల గురించి స్పష్టత ఇవ్వకుండా వారి జీవితాలను రోడ్డున పడేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రస్తుతం మద్యం దుకాణాలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్నాయి. చంద్రబాబు సర్కారు ఆ పాలసీని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రైవేట్‌కే దుకాణాలను అప్పగించాలని మొగ్గుచూపుతోంది. ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మద్యం పాలసీలను, అందులో లోటుపాట్లను పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించింది. దీంతో కమిటీలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి స్థితిగతులను పరిశీలించి మరికొద్దిరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నాయి. అక్టోబర్ ఒకటి నుంచి నూతన పాలసీని అమల్లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీంతో ప్రస్తుతం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది మా సంగతి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ హయాంలో ఇలా..

2019 ముందు వరకు ఉమ్మడి జిల్లాలో సుమారు వందల కొద్ది మద్యం దుకాణాలు, పదుల కొద్ది బార్ అండ్ రెస్టారెంట్లు ఉండేవి. రోజుకు కోట్ల రూపాయాలు విక్రయాలూ సాగేవి, పండగ వేళల్లో సుమారు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు విక్రయాలు జరిగేవి, ప్రతి రెండేళ్లకూ ఒక సారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించే వారు. అత్యధికంగా ఆదాయం వచ్చే దుకాణాలన్నీ రాజకీయ నేతల కనుసన్నల్లో నడిచేవి. ఒక్కో దుకాణానికి అనుబంధంగా నాలుగైదుకు పైగా అనధికార బెల్టుషాపులు ఉండేవి. చిన్నపాటి అంగళ్లు, డాబాల్లో మద్యం 24 గంటలూ అందుబాటులో ఉండేది. 2019లో వైఎస్ఆ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నెలకొల్పింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 192 మద్యం దుకాణాలు, 44 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి.

పరిశీలన ఎలా?

నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తే మద్యం దుకాణాల పర్యవేక్షణ బాధ్యత ఎవరికి అప్పగిస్తారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలను రెండుగా(ఎస్ఈబీ, ఎక్సైజ్) విభజించిన విషయం విదితమే. ఎక్సైజ్ శాఖ మద్యం దుకాణాల నిర్వహణ, ప్రభుత్వ మద్యం దుకాణాల బాధ్యతలను పర్యవేక్షిస్తోంది. జిల్లాలో ఒక డిపో మేనేజర్, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 25 మంది సిబ్బంది ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతన పాలసీ ప్రకారం ప్రైవేటు దుకాణాలు ఏర్పాటైతే ఉన్న అరకొర సిబ్బందితో వాటిని పరిశీలించడం కష్టతరం. దీంతో ఎస్ఈబీని ఎక్సైజ్‌లో కలిపివేయనున్నట్లు తెలుస్తోంది.

ఆందోళనలో సిబ్బంది

ప్రైవేట్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతుండడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కో దాంట్లో సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. దుకాణాలకు వాచ్‌మెన్లు సైతం ఉన్నారు. మొత్తం జిల్లాలో 650 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటైతే వారి మనుషులతోనే నిర్వహిస్తారు. దీంతో తమ పరిస్థితి ఏంటన్న ఆందోళన సిబ్బందికి మొదలైంది.

టీడీపీవారికే షాపులు

అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ దుకాణాలను తొలగించి గతంలోలా ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కూటమి నేతలు ఇప్పటి నుంచే షాపులను దక్కించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో తమకు తెలియకుండా ఎవరూ దుకాణాలకు యత్నించరాదని ఇప్పటికే అధికార పార్టీ నేతలు హుకుం జారీ చేసినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. దీన్ని బట్టి చూస్తే ప్రైవేటు దుకాణాల ఏర్పాటు ఖాయమని తెలుస్తోంది. ఇదే జరిగితే 2014–19 నాటి పరిస్థితులే పునరావృతం కానున్నాయి. ఇదిలా ఉంటే ప్రైవేటు షాపుల విషయంలో టెండర్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే సందేహాలు మద్యం వ్యాపారుల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలోలా లక్కీడిప్ ద్వారా షాపులు కేటాయిస్తారా లేక టెండర్ల ప్రక్రియను బార్లకు నిర్వహించినట్లు ఆన్‌లైన్‌లోనే వైన్‌షాపులకు నిర్వహిస్తారా అనేది తేలాల్సి ఉంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మునివేలు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. గ్రామ పంచాయతీలు నిదులు సమకూర్చుకోవడంలో చొరవ చూపాలన్నారు. చెరువుల్లో చేపల వేలం పాటల ద్వారా, అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లను క్రమబద్ధీకరిస్తూ పంచాయతీలకు నిదులను సమకూర్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ప్రతి పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏవైనా భూసమస్యలు ఉంటే అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. శిరుగురాజుపాళెం సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వీధిలైట్ల నిర్వహణకు తగిన నిదులు పంచాయతీల వద్ద లేదని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ ఇందిర, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో కేవైసీ తప్పనిసరి

కార్వేటినగరం: సహకార సంఘంలో ఉన్న రైతులకు కేవైసీ తప్పనిసరిగా ఉండాలని సహకార సంఘం సీఈవో దుష్యంత్ తెలిపారు. మంగళవారం తమ కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈవో మాట్లాడారు. సభ్యత్వం కలిగిన రైతులు సహకార సంఘాల ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని పేర్కొన్నారు. కేవైసీ నమోదు కోసం ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ అందించి ఈ నెల 30 లోపు కేవైసీ చేసుకోవాలన్నారు. కేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం నమోదుకు ఆసక్తి కలిగిన రైతులు కూడా కేవైసీ చేసుకుని సహకార సంఘంలో సభ్యత్వం పొందాలని కోరారు.

30లోపు కేవైసీ చేసుకోండి

పెనుమూరు(కార్వేటినగరం): ఈ నెల 30 లోపు కేవైసీ చేసుకున్న వారు సహకార సంఘం ఎన్నికల్లో అర్హులని గుంటిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో మురుగన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవైసీ చేసుకున్న వారు మాత్రమే సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందన్నారు. రైతులు వెంటనే సభ్యత్వం నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మార్మోగిన భారతమాతాకీ జై నినాదం



కార్వేటినగరంలో త్రివర్ణ పతాకంతో ర్యాలీ

కార్వేటినగరం: భారత్ మాతాకీ జై నినాదంతో మంగళవారం కార్వేటినగరం వీధులు మార్మోగాయి. ఏపీఎం విజయకుమార్, ఈవో పీఎస్ మణి ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయం ఆర్చి నుంచి పోలీస్ స్టేషన్ వరకు మహిళా సంఘం సభ్యులు త్రివర్ణ పతాకంతోపాటు, స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ దేశభక్తిని స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నేటి తరాలకు తెలపాలనే ఉద్దేశమే ఈ ర్యాలీ అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈఓ పీఎస్ మణి మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రానికి పోరాటం చేసిన మహా యోధులను నిత్యం స్మరించుకోవాలని, వారి త్యాగ ఫలితమే స్వాతంత్య్రమన్నారు. ఈ క్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ మహిళలు, సీసీలు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కీలకం



వ్యర్థాలతో తయారు చేసిన ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లే కీలకమని రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ పరిశీలకుడు(ఆర్‌జీఎస్ఏ) ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చెత్తసంపద భవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జీఎస్ఏ పరిశీలకులు మాట్లాడుతూ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూ కేంద్రాలను సంపద కేంద్రాలు తీర్చిదిద్ది వచ్చే ఆదాయంతో పంచాయతీని అభివృద్ధి చేసుకోవాలన్నారు. పారిశుధ్యలోపం, తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని తెలిపారు. అదే విధంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి నిల్వలు లేకుండా పారిశుధ్యాన్ని మెరుగు చేయాలని, గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి మంచి నీటిని ప్రజలకు అందించాని తెలిపారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీలో వ్యర్థాలతో తయారు చేసిన ఎరువులను పరిశీలించారు. రైతులకు చౌక ధరకు అందించి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓ పీఎస్ మణి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనుంజయవర్మ, సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి



మెయిన్ స్కూల్‌లో భరతమాత చిత్రపటాన్ని అందజేస్తున్న ఆపస్ నాయకులు

పుత్తూరు: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే దేశభక్తిని పెంపొందించాలని, ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడు తనవంతు కృషి చేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఆపస్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు భరతమాత చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎల్.రమేష్‌నాథ్ సౌజన్యంతో భరతమాత చిత్రపటాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు జాతీయ భావజాలంతో ఉన్నత పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లుగా దేశం గర్వపడేలా కీర్తిని ఆర్జించారన్నారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని పుణికిపుచ్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు సుబ్రమణ్యం, రమేష్, చెన్నకేశవులు, చక్రపాణి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని గుండుపల్లె గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మమత కుటుంబాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి పరామర్శించారు. మంగళవారం గ్రామంలో పర్యటించిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మృతదేహానికి పూలమాలవేసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు అనంతరం మమత మృతిపై బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ యువత మండల అధ్యక్షుడు నరేష్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, కో ఆప్షన్ సభ్యుడు వెంకటేష్ పరంధామరెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనం రుచి చూస్తున్న డీవైఈవో

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం, జంబాడ ఉన్నత పాఠశాలలో పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు వండిన వంటకాలను రుచి చూశారు. అనంతరం పాఠశాల గదులను పరిశీలించి, ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాదిరికుప్పంలో వైభవంగా ఆడి పొంగళ్లు



పొంగళ్లు వండుతున్న మహిళలు

కార్వేటినగరం: రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి స్వగ్రామం పాదిరికుప్పంలో వెలసి ఉన్న నడివీధి గంగమ్మ ఆలయంలో ఆడి పొంగళ్ల వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని వేపాకు తోరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాయిద్యాల నడుమ ఉదయం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పొంగళ్లు వండి, పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అర్చకులు అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆడి పొంగళ్లను పురస్కరించుకుని మొక్కులున్న భక్తులు అమ్మవారికి జంతు బలులు సమర్పించారు. దీంతో గ్రామంలో జాతర వాతావరణం చోటు చేసుకుంది.

17వ విడత ఉపాధి బహిరంగ సభ

గంగాధరనెల్లూరు: 17వ విడత సామాజిక బహిరంగ తనిఖీ సభ మంగళవారం జీడీనెల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.9.77 కోట్లు వివిధ శాఖలలో ప్రభుత్వం ద్వారా పనులు జరిగాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా 6.56 కోట్ల పనులు జరిగాయని, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.3.15 కోట్ల పనులు జరిగాయని, గృహ నిర్మాణ శాఖలో రూ.2,36,646, పశు వైద్య విభాగ శాఖ ఆధ్వర్యంలో రూ.2,52,668 ప్రభుత్వం ద్వారా పనులు జరిగాయని తెలిపారు. రికవరీ కింద రూ.4900, పెనాల్టీ కింద రూ.1000 జమ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థను మెరుగు చేయడమే ధ్యేయం



జీడీ నెల్లూరులో విద్యార్థులకు కిట్ల పంపిణీ

గంగాధరనెల్లూరు: రాష్ట్రంలో మరింత మెరుగైన విద్యా వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, బీజేపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అనంతరం గంగాధర నెల్లూరులో ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గంగాధరనెల్లూరు జిల్లా పరిషత్ పాఠశాల నుండి కిలోమీటర్ భారీ ర్యాలీని నిర్వహించారు. 150 అడుగుల జాతీయ జెండాను చేతబట్టి వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో కోలాహలంగా ర్యాలీ నిర్వహించారు.

డైయింగ్ నీళ్లు బయట వదలకూడదు



డైయింగ్ యజమానులతో కమిషనర్ సమావేశం

నగరి: మున్సిపల్ పరిధిలోని మిషన్ డైయింగ్ యూనిట్ల వారు స్వంతంగా ఈటీపీ ఏర్పాటుచేసుకోవాలని, మాన్యువల్ డైయింగ్ యూనిట్ల వారు కామన్ ఈటీపీకే నీటిని వదిలిపెట్టాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ పరిధిలోని డైయింగ్ యూనిట్లవారితో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం సమక్షంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థ నీరు కాలువల్లో ప్రవహించడం ద్వారా చెరువులలో నీరు కలుషితమవుతోందని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సమావేశం నిర్వహించామన్నారు. ఇకపై ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని కోరారు. మున్సిపాలిటీ తరపున ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, డైయింగ్ యూనిట్ యజమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పాలసముద్రం: గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. మంగళవారం వెంగళరాజు కుప్పం సచివాలయ ఆవరణలో 104 వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బందికి, వైద్య పరీక్షలు చేయుటకు వచ్చిన వారితో డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో వైరస్ జ్వరాలు, అతిసారం, డెంగీ తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు





నగరి: బస్టాండు ప్రాంగణంలో మున్సిపల్ సిబ్బంది, పుత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

నగరి: వాడవాడలా మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీలను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయం నుంచి స్వాతంత్య్ర దినోత్సవ విశిష్టతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ప్రాంగణంలో మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా జరిగిన భారత స్వాతంత్య్ర ఉద్యమం ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఈ ర్యాలీలో మేనేజర్ శేఖర్, టీపీవో నీరజాక్షి, మెప్మా అధికారి సునీత, మున్సిపల్ సిబ్బంది, సమాఖ్యకు చెందిన మహిళలు పాల్గొన్నారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నుంచి ప్రిన్సిపల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత జాతీయ పతాకం దేశ సార్వభౌమాధికారానికి, ఐక్యతకు, సమగ్రతకు చిహ్నమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ విభాగం లెఫ్టినెంట్ భాస్కర్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు, అధ్యాపకులు .వేణుగోపాల్, అరుణ కుమారి, గోపి, రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో జాతీయ పతాకాలతో నగరి పట్టణమంతా ర్యాలీ నిర్వహించారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా చూడడం కోసం ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు మోహన్, నాయకులు రమేష్‌నాయుడు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండల మహిళా సమాఖ్య సభ్యులు ఏపీఎం మోహన్ ఆధ్వర్యంలో కొండచుట్టు మండపం వద్ద నుంచి వెలుగు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల మహిళా సమాఖ్య మహిళలు దేశభక్తి గీతాలకు నృత్యాలు ప్రదర్శించారు. ఐకేపీ ఏపీఎం ఫరిద్ మస్తాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వాతంత్య్ర పోరాటంపై అవగాహన కల్పించాలన్నారు. వెంగళరాజుకుప్పంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, ఐకేపీ సిబ్బంది కలసి మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఇందిర, సీసీలు, సంఘమిత్రాలు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశభక్తి గీతాలు, నాటకాలు, ప్రదర్శనలు, మానవ గోపురం నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు తమ దేశభక్తిని ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో దేశభక్తి స్ఫూర్తిని నింపడంతోపాటు, జాతీయ అవగాహన పెంపొందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొని విజయవంతం చేశారు.

స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలి

పుత్తూరు: స్వాతంత్య్ర ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని మున్సిపల్ చైర్మన్ ఎ.హరి కోరారు. ఇందుకు రాష్ట్రం, కేంద్రంలోని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ గతంలో జాతీయ జెండాను ప్రభుత్వ భవనాలపైనే ఎగురవేసేవారమని, ప్రధానమంత్రి పిలుపు మేరకు ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగుర వేయాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక అంబేద్కర్ సర్కిల్ వరకు జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో...

ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులు సరైన అవగాహనపరులుగా తయారు కావాలని అన్నారు. ఇందుకు ప్రతి అధ్యాపకుడు తన వంతు కృషి చేయాలన్నారు. ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.